క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చంద్రగిరి: మహాత్మా జ్యోతిభా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గీతాంజలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23వ సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుకుని ఉండాలన్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉన్న వారు అర్హులన్నారు. అదే విధంగా రాత పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన సీటు కేటాయిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులను http://mjpapbcwries.apcfss.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ప్రిన్సిపల్ 9000783185 నంబరును సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రమంలో ఉదయమాణిక్యం పేరుతో పాఠశాల ఉంటుందని, ప్రస్తుతం చంద్రగిరిలో పాఠశాల నిర్వహణ జరుగుతోందని తెలిపారు.

ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు

భాకరాపేట: అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ హనుమాన్‌నాయక్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే భాకరాపేట రెవెన్యూ గ్రామంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణతో ప్రభుత్వ భూములపై కొందరి కన్ను పడిందన్నారు. వీటిపై రెవెన్యూ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులతో బీసీ సంక్షేమ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు గౌడ్, సోమశేఖర్ ఆచారి తెలిపారు. జిల్లా కోశాధికారిగా ఎం.నాగేంద్ర, తిరుపతి నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా యశోద, తిరుపతి రూల్ మండలం ఉపాధ్యక్షుడిగా శాంతికుమార్, రూరల్ మహిళా అధ్యక్షురాలిగా ఉమా మహేశ్వరిలను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేశారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి రథోత్సవంలో భాగంగా సోమవారం ఆలయం వద్ద చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం, తిరుపతి బ్రాహ్మణ సమాజం భక్తులకు మజ్జిగ, కలకండ పంపిణీ చేశాయి. సేవా కేంద్ర నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే శేషగిరిరావు, రవికుమార్, తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, కొత్తపల్లి విజయ్‌కుమార్, శభరి గిరీషం, కిసాన్, కుషాల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

టాస్క్ ఫోర్స్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ

తిరుపతి అలిపిరి: ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బందికి సోమవారం మెడికల్ చెకప్ నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని పోలీస్ యూనిట్ ఆస్పత్రిలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, కూంబింగ్ సిబ్బందికి ఫిట్‌నెస్ పరీక్షలు చేశారు. మెడికల్ ఆఫీసర్ కవిత వైద్య సలహాలు అందజేశారు. అడవుల్లో కూంబింగ్ చేసే సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పశు వైద్య శిబిరానికి స్పందన

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి ప్రశాంతి 42 పాడి ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆవులకు పిడుదల నివారణకు పిచికారి, డివార్మింగ్, కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమలు, ఆరోగ్య సంరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో జరిగిన ఓ చోరీ కేసులో తిరుచానూరు దామినేడు సమీపంలోని నక్కలకాలనీకి చెందిన సి.మణి అలియాస్ విజయ్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ తెలంగాణాకు చెందిన ఓ భక్తుడు తిరుమల పీఏసీ-2లో ఉండగా అతని జేబులోని సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు నిందితుడు మణితో పాటు జి.బాలకృష్ణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మణి న్యాయమూర్తి ఎదుట నేరం అంగీకరించడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాలకృష్ణపై కేసు విచారణ జరగాల్సి ఉంది.

ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉపేక్షించొద్దు

- వాటిపైనే అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయ్
- తొలగింపునకు చర్యలు తీసుకోండి
- అధికారులకు కమిషనర్ అనుపమ ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు చేపట్టాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. స్పందన, డయల్ యువర్ కమిషనర్ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సోమవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వివిధ అధికారులతో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. అత్యధికంగా ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో కమిషనర్ అనుపమ అంజలి కలుగజేసుకుని ఫుట్‌పాత్ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వారికి ఇదివరకే కేటాయించిన ప్రదేశం కన్నా ఎక్కువ ముందుకొచ్చి ఆక్రమాలకు పాల్పడి ఉంటే తక్షణం తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . రుయా ఆస్పత్రి నుంచి అలిపిరికి వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్లను సైతం ఆక్రమణకు పాల్పడ్డారని కమిషనర్ మండిపడ్డారు. అలానే ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు నగర ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని చెప్పారు. అలిపిరి ఫ్లైఓవర్, కపిలతీర్థం రోడ్ ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించేసి షాపులు నడుపుతున్నారని, దీని వల్ల పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజా రవాణాకు ఆటం కలిగించే ఏ ఆక్రమణను ఉపేక్షించ వద్దని అధికారులకు సూచించారు. నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు చొరవ తీసుకోవాలని ప్రజా ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. రోడ్లను తవ్వి అసంపూర్తిగా వదిలేసిన వాటిపై ఇంజినీర్లు దృష్టి సారించాలన్నారు. రోడ్లు తవ్వి పనులు పూర్తయిన చోట వెంటనే ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలన్నారు. స్పందనకు వచ్చే ప్రతి ఫిర్యాదుకు సంబంధిత శాఖ అధికారి బాధ్యత వహించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చిన్నజియర్‌స్వామికి సాదర స్వాగతం



చిన్నజియర్ స్వామి నుంచి ప్రసాదం స్వీకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రేణిగుంట: తిరుమల పర్యటన నిమిత్తం సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న త్రిదండి పీఠాధీశులు చిన్నజియర్‌స్వామికి సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ మోహిత్‌రెడ్డిని ఆయన ఆప్యాయంగా పలకరించి ఆపిల్ పండును ప్రసాదంగా ఇచ్చి మంచి భవిష్యత్ కలగాలని అక్షితలు వేసి ఆశీస్సులు అందించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

చెవిరెడ్డికి ఎస్సీ సెల్ నేతల సత్కారం

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు సోమవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీలో తగిన గుర్తింపు కల్పించి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ జగనన్నకు కృతజ్ఞతతో మెలగాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్పొరేటర్లు ఎస్‌కే బాబు, ఆంజనేయులు, మధు, లక్ష్మయ్య, అమరనాథ రెడ్డి, మహేష్ బాబు, మోహన్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి చిద్విలాసం



తిరుచ్చిపై భక్తులను కటాక్షిస్తున్న శ్రీకృష్ణుడు

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీనివాసమంగాపురం, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణ స్వామివారు తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఖాతాదారులకు డివిడెండ్ ఇప్పించేందుకు కృషి

- టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: ఖాతాదారులకు త్వరలోనే డివిడెండ్ ఇప్పించేందుకు కృషి చేస్తామని కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణలో మహాజన సభ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నూతన పాలకమండలి ఏర్పడిన అనంతరం ఎనిమిది నెలల కాలంలో మొండి బకాయిల శాతాన్ని 24 నుంచి 14 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. సుమారు రూ.5.5 కోట్ల మొండి బకాయిలను వసూలు చేశామని తెలిపారు. ఓవర్ డ్యూ బకాయిలు రూ.49 కోట్లలో రూ.17 కోట్లు వసూలు చేశామన్నారు. నెలలోగా ఏటీఎంను ఖాతాదారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. యూపీఐ, ఫోన్ పే, గూగుల్ పే తదితర సేవలను వినియోగించుకునేందుకు వీలుగా జాతీయ బ్యాంకులతో దీటుగా ఖాతాదారులకు సేవలను మరింత విస్తృతం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ నుంచి విరివిగా రుణాలు అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా వ్యాపారులకు రుణ సదుపాయాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఎండీ భారతి, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, రేమాల బ్రహ్మనందరెడ్డి, ముబ్బు నాదముని రెడ్డి, జ్యోతి ప్రకాష్, సురేష్, అనిల్ రాయల్, వెంకటేష్ రాయల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎంపీపీ మోహిత్‌రెడ్డి

పాకాల: వైఎస్సార్‌సీపీ పాకాల డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి తండ్రి నంగా రాజారెడ్డి (71) ఆదివారం మృతి చెందారు. సోమవారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంటపల్లెలోని కపిలేశ్వర్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట నంగా నరేష్‌రెడ్డి, నంగా బాబురెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, లోకనాథం, పవన్‌కుమార్, రమేష్, మునీర్, గుండ్లూరి సురేష్ ఉన్నారు.

రైట్ టు వెల్త్ బిల్లు రద్దు చేయండి

- రాజస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

తిరుపతి అర్బన్: వైద్యులను దెబ్బతీసేలా రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైట్ టూ వెల్త్ బిల్లును రద్దు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శారద్‌కుమార్ అగర్వాల్ డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్ వద్ద వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ రోగులను ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వలే ఉచితంగా వైద్యం అందించాలని రాజస్థాన్ ప్రభుత్వం బిల్లును తీసుకురావడాన్ని తప్పుపట్టారు. రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వైద్యుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌వెంకటరమణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీహరి, రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ పాల్గొన్నారు.

బుద్ధిమాద్యం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ



తిరుపతి కల్చరల్: పద్మావతిపురం పాస్ వినోవికాస్ కేంద్రంలోని వంద మంది బుద్ధిమాద్యం అనాథ పిల్లలకు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో వారానికి సరిపడే చాక్లెట్లు, బిస్కెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి వి.జగన్నాథం, విశ్వనాథ్, రఘు, రామారావు, మనో వికాస్ కేంద్రం ఇన్‌చార్జ్ మురళి పాల్గొన్నారు.

కళాకారులకు విశిష్ట సేవా పురస్కారాలు



విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్న కళాకారులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రపంచ రంగస్థలి దినోత్సవాన్ని పురస్కరించుకుని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో కళారంగంలో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ కళామతల్లికి సేవలందిస్తున్న కళాకారులకు విశిష్ట సేవా పురస్కాలతో సత్కరించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్లిస్ హోటల్ అధినేత, కళాపోషకుడు ముబ్బు సూర్యనారాయణరెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్తమ నటులుగా ఆమూరి సుబ్రమణ్యం, బొందరామచంద్రారెడ్డి, జీఎస్.కోటేశ్వరరావు, కె.సిద్దేశ్వర శర్మ, గంగయ్య, గోపాల్‌రావు, నాథమునిరెడ్డి, కె.చంద్రబాబు నాయుడు, డి.గోపాల్‌ను విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ నటీమణులుగా పి.యశోద, శోభశ్రీ, డి.హసీనా, కె.సాయి నవీనలను, ఉత్తమ హాస్యనటుడిగా శాంబోలు హరినాథ్, ఉత్తమ హాస్యనటిగా సుభద్రలను విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్

పాకాల: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ కొత్తపల్లె రోడ్డు నుంచి మల్లెలచెరువుపల్లె వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గౌరీశంకర్‌రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి విద్యుత్ స్తంభాలు లేక స్థానికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రస్తుతం పంచాయతీ నిధులతో 15 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ప్రతి ఇల్లు ఓ రంగస్థలమే



కళాకారులను సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రతి ఇల్లు ఓ రంగస్థలమని, అందులో తల్లిదండ్రులు, బిడ్డలు, మనవళ్లు పాత్రదారులైతే బంధువులు, స్నేహితులు ప్రేక్షకులని రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి అన్నారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్లో సోమవారం ప్రపంచ రంగస్థలి దినోత్సవాన్ని నిర్వహించారు. కళారంగానికి సేవలు అందిస్తున్న సీనియర్ కళాకారులు ఆముదాల నారాయణ, కొత్తపల్లి మునిరత్నం, సాయినవీన, లతను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, బొందరామచంద్రారెడ్డి, సుందరం, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- గడప గడపలో భాగంగా 3వ డివిజన్‌లో పర్యటన

తిరుపతి మంగళం: జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంట్లో సంక్షేమమే అని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి 3వ డివిజన్‌లో కార్పొరేటర్ తమ్ముడు గణేష్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాలు, మతాలు, పార్టీలు చూడలేదు.. ఓట్లు మనకు వేశారా లేదా అని చూడలా.. కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఎలా ఉండేది.. ఇప్పుడు ఎలాంటి పరిస్థితి ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు.

ఇల్లు అలకగానే పండుగ కాదు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు మూడు సీటుగెలవగానే మీసాలు తిప్పుతూ తొడలు కొడుతున్న టీడీపీ నాయకులు ఇల్లు అలకగానే పండుగ కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఏ ఎన్నికల్లోనైనా ఓటుకు నోటుతో ప్రలోభాలు పెట్టి కుట్రలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కొన్ని సీట్లు గెలవగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రాఫ్ తగ్గినట్టు కాదన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పనితీరుపై ప్రజల హర్షం

ఎన్నో ఏళ్లుగా సొంత ఇళ్లు లేక నానా అవస్థలు పడుతున్న తమకు జగనన్న సొంతింటి కళ నెరవేర్చారు నాయనా అంటూ 3వ డివిజన్‌లోని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న అందించిన అమ్మ ఒడితో తమ బిడ్డలను మంచి పాఠశాలలో చదివించుకుంటున్నామని మహిళలు తెలిపారు. చేయూత డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నామని పలువురు అభినయ్‌రెడ్డి వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తామంతా ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, మోహన్‌కృష్ణయాదవ్, డాక్టర్ అనీష్‌రాయల్, కో-ఆప్షన్ సభ్యులు ఇమామ్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, అనీల్‌రాయల్, పార్టీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, భరణీయాదవ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆదర్శంగా దామినేడు పీహెచ్‌సీ అభివృద్ధి

- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆరోగ్యం కేంద్రానికి అవసరమైన మెటీరియల్ కొనుగోలుకు నిధులు మంజూరు చేసేందుకు ఎంపీపీ ఆమోదం తెలిపారు. రోగులకు ఆస్పత్రి సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటనారాయణ, తహసీల్దార్ లోకేశ్వరి పాల్గొన్నారు.

రేపు పెన్షనర్ల నూతన భవనం ప్రారంభోత్సవం



అసోసియేషన్ అధ్యక్షుడు మార్కొండారెడ్డి

తిరుపతి కల్చరల్: నగరంలోని ఎల్ఐసీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పెన్షనర్ల నూతన భవనాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మార్కొండారెడ్డి, ఎ.రాజశేఖర్ తెలిపారు. అలాగే అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు హాజరవుతారన్నారు. ఈ మేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి.విశ్వనాథనాయుడు, జె.రామలింగారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాల ఆహారాన్ని రుచి చూస్తున్న అధికారులు

చంద్రగిరి:చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ప్రదీప ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీతో పాటు ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంఈఓ లలిత కుమారి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలతో వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. ఇందులో శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మాధవరెడ్డి, సుజాత, చంద్రమౌళిరెడ్డి, రాజయ్య, ఈఓపీఆర్డీ శశిరేఖ, ఏపీఎం సరిత, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో 15 పతకాలు



తిరుపతి ఎడ్యుకేషన్: తెలంగాణలోని వరంగల్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో టాలెంట్ హంట్ ప్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతి క్రీడాకారులు 15 పతకాలు సాధించారు. కోచ్ గోపినాథ్ నాయుడు ఆధ్వర్యంలో 20 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా పోటీలు జరిగాయి. ఆయా విభాగాల్లో 5 మంది బంగారు, 5మంది వెండి, 5 మంది కాంస్య పతకాలు సాధించారు.